



EVENING EDITION
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
మంగళవారం
20 ఆగస్టు 2024
పేజీలు: 02




## హ్యాట్రిక్ మెడల్‌పై కన్నేసిన నీరజ్

### మూడు రోజుల్లో డైమండ్ లీగ్

ఒలింపిక్స్ తర్వాత నీరజ్ చోప్రా తొలి టోర్నీలో బరిలోకి దిగుతున్నాడు. సర్జరీని వాయిదా వేసుకొని మరీ లసాన్నె డైమండ్ లీగ్‌లో బల్లెం వీరుడు అడుగుపెడుతున్నాడు. ఇది వరకే రెండుసార్లు విజేతగా నిలిచిన నీరజ్ హ్యాట్రిక్‌పై కన్నేశాడు. అయితే.. ఈసారి విజయం అతడికి అంత తేలిక కాకపోవచ్చు. ఎందుకంటే.. ఒలింపిక్స్‌లో ఈటెను 90 మీటర్ల దూరం విసిరిన అర్షద్ నదీమ్ స్వర్ణం ఎగరేసుకుపోయాడు. డైమండ్ లీగ్‌లోనూ మిగతా జావెలిన్ త్రోయర్ల నుంచి నీరజ్‌కు గట్టి పోటీ ఎదురుకావొచ్చు. అందుకని భారత అథ్లెట్ ఈసారి 90 మీటర్ల మార్క్ అందుకోవడంపై దృష్టి పెట్టాడు. ఆగస్టు 22 నుంచి టోర్నీ షురూ కానుంది. పారిస్ ఒలింపిక్స్‌లోనూ పతకంతో మెరిసిన నీరజ్ చోప్రా భారత అథ్లెటిక్స్‌కు వైభవం తెచ్చాడు.

ఇప్పుడు లసాన్నె డైమండ్ లీగ్‌లో చోప్రా మూడో మెడల్ లక్ష్యంగా సాధన చేస్తున్నాడు. ఈ లీగ్‌లో నీరజ్‌కు గొప్ప రికార్డు ఉంది. మొదటిసారి 2022లో ఈటెను 89.08 మీటర్ల దూరం విసిరిన నీరజ్ విజేతగా నిలిచాడు. మరుసటి ఏడాది కూడా జోష్ చూపిస్తూ బల్లెంను 87.66 మీటర్ల దూరం విసిరి టైటిల్ నిలబెట్టుకున్నాడు. ఒలింపిక్ మెడల్ ఉత్సాహంతో ముచ్చటగా మూడో టైటిల్ కొల్లగొట్టేందుకు నీరజ్ సిద్ధమయ్యాడు.

## కోహ్లీకి బౌలింగ్ చేస్తా..



ప్రపంచ క్రికెట్‌లో అథ్లెట్‌ను తలపించే విరాట్ కోహ్లీకి ఫ్యాన్స్ ఎక్కువే. ఫిట్‌నెస్ ఫ్రీక్ అయిన విరాట్ ఫాలోయింగ్ గురించి చెప్పాల్సిన పని లేదు. సొగసైన ఆటతో పాటు మైదానంలో దూకుడుతో ఈతరం క్రికెటర్లకు ఆరాధ్యుడైన కోహ్లీని ఇష్టపడని వారుండరు. తాజాగా అతడి ఫ్యాన్ క్లబ్‌లో న్యూజిలాండ్ యువ క్రికెటర్ చేరింది. కివీస్ స్పిన్నర్ అయిన క్జర జెట్లీ భారత స్టార్‌తో ఫొటో దిగాలని ఆశపడుతోంది. వరల్డ్ క్లాస్ బ్యాటర్ కోహ్లీతో ఇన్‌స్టాగ్రామ్ ఫొటో దిగాలని ఆశపడు తున్నాని ఆమె తెలిపింది. దేశవాళీలో వెల్లింగ్‌టన్ బ్లేజ్ జట్టుకు ఆడుతున్న జెట్లీ తాజాగా ఫైన్ లెగ్స్ ది క్రికెట్ పోడ్‌కాస్ట్‌లో మాట్లాడింది. ఆ సందర్భంగా ఆమె కోహ్లీపై అభిమానాన్నిచాటుకుంది. 'మహిళల క్రికెట్ మ్యాచుల్లో నేను సూపర్‌గా బౌలింగ్ చేస్తాను. ఇక పురుషుల క్రికెట్‌లో నాకు కోహ్లీకి బౌలింగ్ చేయాలని ఉంది. ఒకవేళ అతడితో ఓ ఫొటో దిగితే దాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పెడుతా. నా లక్ష్యమదే' అని 22 ఏండ్ల జెట్లీ తెలిపింది.



## కవిత బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా

### ఈ నెల 27కు వాయిదా వేసిన సుప్రీంకోర్టు

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ వాయిదా పడింది. వచ్చే మంగళవారం విచారణ చేపడతామని కోర్టు పేర్కొంది. ఈ కేసులో సీబీఐ కౌంటర్ దాఖలు చేయగా, ఈడీ సమయం కోరింది. కోర్టు ఈడీకి ఈ నెల 27 వరకు అవకాశం ఇచ్చింది. కాగా, ఢిల్లీ హైకోర్టు తన బెయిల్ తిరస్కరించడంతో కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.




## ఆరోగ్యశ్రీపై ప్రభుత్వం కీలక నిర్ణయం!

బీమా విధానంలో ఎన్టీఆర్ వైద్య సేవ(ఆరోగ్యశ్రీ) ను అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఒక్కో కుటుంబం తరపున ₹1,700-2,000 ప్రీమియంను బీమా సంస్థలకు చెల్లించాల్సి రావొచ్చని అధికారులు అంచనా వేశారు. దీంతో ప్రభుత్వంపై ఏడాదికి ₹3వేల కోట్ల భారం పడొచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ పరిమితి ₹25 లక్షలు ఉండగా, బీమా పరిమితి ₹2.50 లక్షలు ఉంటుంది. రోగి వైద్యానికి ఆ మొత్తం దాటితే సర్కారు చెల్లిస్తుంది.

## బాక్సాఫీస్‌ను షేక్ చేస్తోన్న శ్రద్ధాకపూర్ స్త్రీ 2

### 5 రోజుల్లోనే రూ.242 కోట్లు

బాలీవుడ్ భామ శ్రద్ధా కపూర్, రాజ్ కుమార్ రావు కాంబో రిలీజైన సీక్వెల్ 'స్త్రీ 2'. అమర్ కౌశిక్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం హార్రర్ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కింది. పంకజ్ త్రిపాఠి కీలక పాత్రలో నటించిన ఈ ప్రాజెక్ట్ ఆగష్టు 15న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలైన విషయం తెలిసిందే. ఇప్పటికే ఓపెనింగ్ డేన ఫైటర్, కల్కి 2898 ఏడీ (హిందీ) వసూళ్లను అధిగమించి ఈ ఏడాది హిందీ సినిమాలో బిగ్గెస్ట్ ఓపెనర్‌గా నిలిచింది. 5 రోజుల్లోనే 242 కోట్ల క్లబ్‌లోకి చేరిపోయి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఇప్పటివరకు రూ.242 కోట్లు రాబట్టింది. నేడు రక్షాబంధన్ కావడంతో కలెక్షన్లు మరింత పెరిగే అవకాశముందని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. ఓ వైపు వేదా, మరోవైపు ఖేల్ ఖేల్ మే చిత్రాలున్నప్పటికీ బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లతో స్క్రీనింగ్ అవుతోంది. ఈ స్పీడు ఇలాగే కొనసాగితే రెండో వారం ముగిసే లోపు రూ.400 కోట్ల క్లబ్‌లోకి చేరినా ఆశ్చర్యపోనవసరం లేదని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు.



## కోల్‌కతా ట్రైనీ డాక్టర్ రేప్.. ఆందోళన వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు

కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో జరిగిన ట్రైనీ డాక్టర్ రేప్, మర్డర్ ఘటనపై ఇవాళ సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును విచారిస్తున్నది. ఆ బెంచ్‌లో జస్టిస్ జేబీ పర్దివాలా, మనోజ్ మిశ్రాలు ఉన్నారు. కోల్‌కతా ఘటన.. దేశవ్యాప్తంగా డాక్టర్ల భద్రత అంశం గురించి ఆందోళన కలిగిస్తోందని సీజేఐ అన్నారు. డాక్టర్ల గురించి ఆందోళన చెందుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. అత్యాచార బాధితురాలి పేరు, ఫోటో, వీడియో క్లిప్ ఎలా బయటకు లీకైందని, బాధితురాలి పేరును వెల్లడించడం చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుందని, ప్రాణాలు కోల్పోయిన ఓ యువ డాక్టర్ గౌరవాన్ని ఇలాగేనా కాపాడేది అంటూ సుప్రీం ధర్మాసనం తెలిపింది. ట్రైనీ లేడీ డాక్టర్ ఘటనను సూసైడ్‌గా చిత్రీకరించిన ప్రిన్సిపల్ వైఖరిని సుప్రీం తప్పుపట్టింది. ఎందుకు ఆమె పేరెంట్స్‌కు బాడీని చూసే అవకాశాన్ని ఇవ్వలేదని ప్రశ్నించారు. ఎఫ్ఐఆర్ రిజిస్ట్రేషన్ గురించి కూడా సుప్రీం ప్రశ్నించింది. క్రైం ఉదయం పూట జరిగితే, ఎందుకు అప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని కోర్టు




అడిగింది. రాత్రి 11.45 నిమిషాల వరకు ఎందుకు ఎఫ్ఐఆర్ రాయలేదని సీజేఐ ప్రశ్నించారు. అయితే అసహజ మరణం కింద కేసును రిజిస్టర్ చేసినట్లు సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబల్ తెలిపారు. అర్థరాత్రి వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదంటే, అది మర్డరే అన్న సంకేతాన్ని ఇస్తుందని సుప్రీంకోర్టు తెలిపింది. ఒక హాస్పిటల్‌లో తీవ్రమైన నేరం జరిగిందని, అసలు ఎలా విధ్వంసకారుల్ని ఆస్పత్రిలోకి రానిస్తున్నారని సుప్రీం బెంచ్ ప్రశ్నించింది. కోల్‌కతా డాక్టర్ రేప్ ఘటనపై స్టేటస్ రిపోర్టును సీబీఐ ఇవ్వాలని సుప్రీం కోరింది. ఈ కేసులో విచారణ ఏ స్థాయిలో జరుగుతోందని చెప్పాలని వెల్లడించింది. జాతీయ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని, సీనియర్, జూనియర్ డాక్టర్ల రక్షణ కోసం చేపట్టాల్సిన చర్యల గురించి సూచనలు చేయాలని సీజేఐ తన తీర్పులో వెల్లడించారు.



## సెబీ చీఫ్ మాధబిపై ఎంక్వైరీ!

సెబీ ఛైర్‌పర్సన్ మాధబి పురిపై హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపై దర్యాప్తు జరిపించాలని కేంద్ర ఆర్థిక శాఖ యోచిస్తున్నట్టు తెలుస్తోంది. సెబీ ప్రతినిధులు కూడా ఈ దర్యాప్తు సంఘంలో ఉంటారని సమాచారం. అయితే, సెబీ చీఫ్‌గా మాధబి కొనసాగుతున్న నేపథ్యంలో, ఆమె నియంత్రణలోని సంస్థ ప్రతినిధులు ఇందులో భాగస్వామ్యం అయితే కమిటీ విచారణపై అనుమానాలు పెరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## బరువు పరిమితి బాధ్యత వినేశ్‌దే



బరువు పరిమితికి తగిన విధంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత క్రీడాకారులదేనని, దానిపై ఎటువంటి మినహాయింపులు ఉండవని ది కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (కాస్) తేల్చిచెప్పింది. వినేశ్ అప్పీలును కాస్ ఈ నెల 14న తిరస్కరించిన సంగతి తెలిసిందే. దానిపై తాజాగా వివరణ ఇచ్చింది. 'నిబంధనలు ఎవరికైనా ఒకటే. మినహాయింపు ఉండదు. ఆ విషయంలో రూల్స్ స్పష్టంగా ఉన్నాయి' అని పేర్కొంది.

## అత్యధికంగా యూసుఫ్‌గూడలో.. హైదరాబాద్‌లో వర్షపాతం

తెలంగాణ వ్యాప్తంగా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం రాత్రి మొదలైన వర్షం.. మంగళవారమూ కొనసాగింది. వేకువజాము నుంచి కురిసిన కుండపోత వర్షంతో హైదరాబాద్ నగరం తడిసి ముద్దయింది. ప్రధాన మార్గాలన్నీ జలమయమయ్యాయి. జీహెచ్ఎంసీ పరిధిలో విద్యాసంస్థలకు ప్రభుత్వం నేడు సెలవు ప్రకటించింది.

సోమవారం రాత్రి 8.30 గంటల నుంచి మంగళవారం ఉదయం 7 గంటల వరకు కురిసిన వర్షపాతం వివరాలను తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీజీడీపీఎస్) వెల్లడించింది. జీహెచ్ఎంసీ పరిధిలో యూసుఫ్‌గూడలో అత్యధికంగా 125.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపింది. ఆ తర్వాత ఉప్పల్(121.0), రాజేంద్రనగర్ (119.0)లో అత్యధికంగా వర్షం కురిసినట్లు తెలిసింది. రాష్ట్రంలో జోగులాంబ గద్వాల జిల్లా అయిజలో అత్యధికంగా 132.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ పేర్కొంది. ఆ ఆ తర్వాత వనపర్తి జిల్లా శ్రీరంగపూర్‌లో 130.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది.

హైదరాబాద్‌లో వర్ష బీభత్సం.. రోడ్డుపైకి కొట్టుకొచ్చిన మృతదేహం

నగరంలో వర్షం బీభత్సం సృష్టించింది. ప్రధాన రహదార్లపైకి భారీగా వరదనీరు చేరడంతో ఎక్కడికక్కడ రాకపోకలు స్తంభించాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. నాలాలు పొంగి ప్రవహించాయి. భారీ వర్షాలకు ఓ వ్యక్తి మృతిచెందారు. పార్సీ గుట్ట నుంచి వరదనీటిలో రోడ్డుపైకి మృతదేహం కొట్టుకొచ్చింది. మృతుడిని రాంనగర్‌కు చెందిన అనిల్‌గా గుర్తించారు. మరోవైపు పంజాగుట్ట కాలనీ సుఖ్‌నివాస్ అపార్ట్‌మెంట్ వద్ద పిడుగు పడింది. షెడ్డుపై పడటంతో ఓ కారు ధ్వంసమైంది. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. మలక్‌పేట ప్రధాన రహదారి రైల్వే వంతెన కిందకు భారీగా వరదనీరు చేరింది. డబీర్‌పురా వద్ద వరద ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోయాయి.

హైదరాబాద్‌లో భారీ వర్షం.. విద్యా సంస్థలకు సెలవు

మంగళవారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షం కారణంగా జీహెచ్ఎంసీ పరిధిలోని విద్యాసంస్థలకు నేడు రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఈ మేరకు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్లు ప్రకటన జారీ చేశారు. సెలవుపై పరిస్థితులకు అనుగుణంగా ప్రధానోపాధ్యాయులు నిర్ణయం తీసుకోవాలని సూచించారు. భారీ వర్షంతో నగర వ్యాప్తంగా కాలనీలన్నీ జలమయమయ్యాయి. పలు లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు చేరింది. జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఏదైనా సమస్య తలెత్తితే 040-21111111, 9000113667 నంబర్లకు కాల్ చేయాలని జీహెచ్ఎంసీ అధికారులు సూచించారు.





EVENING EDITION
మంగళవారం | 20 ఆగస్టు 2024
www.suryaa.com
4 PM
సూర్య
www.suryaa.com
EVENING EDITION 4 PM



## మేం అధికారంలోకి వచ్చాక రాజీవ్ విగ్రహం తీసేస్తం

తెలంగాణ సచివాలయం ఎదురుగా తెలంగాణ తల్లి విగ్రహా ఏర్పాటుకు కేటాయించిన స్థలంలో ఏర్పాటు చేస్తున్న రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని అక్కడి నుంచి తరలించి తీరుతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. సోమవారం నందినగర్‌లోని తన నివాసంలో మీడియా అడిగిన ఒక ప్రశ్నకు కేటీఆర్ సమాధానమిస్తూ.. నాలుగేండ్లలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, ఆ స్థలంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టంచేశారు.
రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని సకల మర్యాదలతో తరలించి, కాంగ్రెస్ కోరుకున్న చోట ఏర్పాటు చేస్తామని తేల్చిచెప్పారు. తెలంగాణ పౌరుషం, తెలంగాణ వైభవాన్ని చాటేలా అద్భుతమైన డిజైన్‌తో సచివాలయాన్ని కేసీఆర్ సర్కారు నిర్మించిందని తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించేలా సచివాలయం ఎదురుగా ఒక ఐలాండ్‌ను క్రియేట్ చేశామని, దశాబ్ది ఉత్సవాల్లోనే అక్కడ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని నిర్ణయం తీసుకున్నామని వివరించారు.
సచివాలయానికి అంబేద్కర్ పేరును పెట్టామని, ఆ మహనీయుడికి ఘనమైన నివాళి అర్పించేలా అతిపెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేశామని వెల్లడించారు. తెలంగాణ అమరుల త్యాగాలను గుర్తుచేసేలా అమరజ్యోతి స్మారకాన్ని నిర్మించామన్నారు.
తెలంగాణ అస్థిత్వానికి కాంగ్రెస్ అవమానం
కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణ తల్లి విగ్రహ స్థానంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పెడుతున్నదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకప్పుడు మాజీ సీఎం అంజయ్య పేరుతో ఉన్న పారు కాస్తా లుంబిని పార్కు అయ్యిందని, అదే అం జయ్య పారు ఎదురుగా ఆయనను అవమానించిన రాజీవ్‌గాంధీ విగ్రహం పెడుతున్నారని అభ్యంతరం వ్యక్తంచేశారు.



# నా క్యాబినెట్‌లో మస్క్‌కు చోటు

## రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్

తాను అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైతే టెస్లా సీఈవో ఎలాన్ మస్క్‌కు క్యాబినెట్‌లో చోటిస్తానని.. అలా కానిపక్షంలో సలహాదారుడిగానైనా నియమించుకుంటానని రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. అతడు చాలా తెలివైన వ్యక్తి అంటూ ప్రశంసలు కురిపించారు. విద్యుత్ వాహనాలపై ఇస్తోన్న 7,500 డాలర్ల ట్యాక్స్ క్రెడిట్‌ను రద్దు చేసే అంశాన్ని పరిశీలిస్తానని పేర్కొన్నారు. ట్యాక్స్ క్రెడిట్‌లు, పన్ను ప్రోత్సాహకాలు సాధారణంగా ఆర్థిక వ్యవస్థకు మేలు చేకూర్చే అంశాలు కావని అభిప్రాయపడ్డారు. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌నకు మస్క్ తన మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయనపై జరిగిన హత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండించారు. జేడీ వాన్స్‌ను ఉపాధ్యక్ష అభ్యర్థిగా ఎంపిక చేయడాన్నీ ప్రశంసించారు. ఇటీవల వీరిద్దరి మధ్య సంబంధాలు బలపడుతున్నాయి. ఈ మధ్యే ఇరువురూ ఎక్స్‌లో ఇంటర్వ్యూ తరహాలో వివిధ అంశాలపై చర్చించుకున్న విషయం తెలిసిందే. మస్క్‌కు కీలక పదవి ఇస్తానని ట్రంప్ అనడం ఇది తొలిసారేం కాదు. 2016లో గెలిచిన సమయంలో రెండు కీలక సలహా మండళ్లకు మస్క్‌ను ఎంపిక చేశారు. కానీ, పారిస్ పర్యావరణ ఒప్పందం నుంచి బయటకు రావాలనే ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 2017లోనే ఆయన రాజీనామా చేశారు.
నేను సిద్ధంగా ఉన్నా: మస్క్
తనను క్యాబినెట్‌లోకి తీసుకుంటానన్న ట్రంప్ ప్రతిపాదనపై ఎలాన్ మస్క్ సానుకూలంగా స్పందించారు. 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ'కి నేతృత్వం వహించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఆ బాధ్యతల్లో ప్రసంగిస్తున్నట్లుగా ఉన్న ఓ చిత్రాన్ని కూడా పోస్ట్ చేశారు. ప్రభుత్వ పెట్టుబడులను క్రమబద్ధీకరించి.. వృథాను అరికట్టేలా ఓ విభాగాన్ని ఏర్పాటు చేయాలని ట్రంప్‌తో ఇటీవల జరిగిన చర్చలో మస్క్ ప్రతిపాదించారు.



## జియో ధమకా ఆఫర్..

### రూ.75కే అన్‌లిమిటెడ్ కాలింగ్

దేశీయ టెలికాం రంగంలో జియో నంబర్ స్థానంలో దూసుకుపోతుంది. రీఛార్జ్ ప్లాన్‌ల ధరలు పెంచినప్పటికీ బీఎస్ఎన్ఎల్, విఐ, ఎయిర్‌టెల్‌లకు పోటీనిస్తూ కస్టమర్లను తనవైపు తిప్పకుంటుంది. క్వాలిటీ నెట్‌వర్క్, వేగవంతమైన డేటా, అన్‌లిమిటెడ్ బెనిఫిట్స్‌తో ప్రతి ఒక్కరికీ చేరువైంది. ఈ క్రమవంలోనే జియో తన యూజర్ల కోసం రూ.75 ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. దీని గురించి వివరంగా తెలుసుకుందాం. జియో ఈ రూ.75 ప్లాన్ జియో ఫోన్‌కి సంబంధించినది. దీని వాలిడిటీ 23 రోజులు, ఈ ప్లాన్‌లో రోజుకు 100ఎంబీ డేటా లభిస్తుంది. ఇది మొత్తం 23 రోజులకు 2.5GB డేటాతో సమానం. డేటా లిమిట్‌కు చేరుకున్న తర్వాత ఇంటర్నెట్ స్పీడ్ 64 కెబిబిఎస్‌లకు తగ్గుతుంది. ఇది కాకుండా అన్‌లిమిటెడ్ కాలింగ్, 5 ఎస్ఎమ్ఎస్‌లు ప్లాన్‌లో అందుబాటులో ఉన్నాయి. ఈ ప్లాన్‌లో బోనస్‌గా 200ఎంబీ డేటా లభిస్తుంది. జియో రూ. 75 ప్లాన్‌ని రీఛార్జ్ చేయడం చాలా సులభం. ఇది రూ. 75కి చాలా ఉపయోగంగా ఉంటుంది. అయితే ఈ ప్లాన్ కేవలం జియో ఫోన్ వినియోగదారులకు మాత్రమే. కొంచెం ఎక్కువ డేటా అవసరమయ్యే వారికి జియో రూ. 125 ప్లాన్ మరొక ఎంపిక. ఈ ప్లాన్ కూడా 23 రోజుల వాలిడిటీతో వస్తుంది. అయితే ఇది రోజుకు 500ఎంబీ డేటాను అందిస్తుంది. అలానే జియోలో మరెన్నో ఇతర రీఛార్జ్ ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. మీ అవసరాలకు తగ్గట్టుగా ప్లాన్ ఎంచుకోండి.

## 'రేప్' దోషులకు ఈ దేశాల్లో మరణమే!




ఘోరమైన హత్యాచారాల దోషులకు సైతం భారత్‌లో ఉరి శిక్ష పడటం చాలా అరుదు. ఏళ్ల తరబడి విచారణలు, క్షమాభిక్షలు, మానవ హక్కులు వంటి పలు అంశాలు వారిని రక్షిస్తుంటాయి. కానీ కొన్ని దేశాల్లో దోషుల్ని చంపటమే సరైనదిగా భావిస్తారు. సౌదీలో రేపిస్టులకు బహిరంగ శిరచ్ఛేదం ఉంటుంది. ఉత్తర కొరియాలో కాల్చి చంపుతారు. ఇక పాక్, చైనా, ఇరాక్, ఈజిప్టు, క్యూబా, యూఏఈ, అఫ్గాన్ దేశాల్లోనూ దోషులకు మరణశిక్షలే అమలుచేస్తారు.

# ఈ నెలాఖరులో డీఎస్సీ రిజల్ట్స్ ?



డీఎస్సీ ఫలితాలను ఈ నెలాఖరులో విడుదల చేసేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో 11,062 టీచర్ పోస్టుల భర్తీకి ఇటీవల నిర్వహించిన డీఎస్సీ పరీక్షలకు 2.45 లక్షల మంది హాజరయ్యారు. ఈ నెల 13న రెస్పాన్స్ షీట్లతో పాటు ప్రిలిమినరీ కీని స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు రిలీజ్ చేశారు. మంగళవారం సాయంత్రం 5 గంటలతో అభ్యంతరాల స్వీకరణ ముగియనుంది. అభ్యంతరాలపై సబ్జెక్టు ఎక్స్ పర్ట్ కమిటీ సమీక్షించి, ఈ నెలాఖరులోనే ఫైనల్ కీ, ఆ వెంటనే రిజల్ట్స్ విడుదల చేసే చాన్స్ ఉంది. వచ్చేనెల మొదటివారంలో జిల్లాల వారీగా పోస్టులు, వివిధ మీడియంలలో మెరిట్ లిస్టులు రిలీజ్ చేయనున్నట్లు తెలుస్తున్నది.
1:3 రేషియోలో ఎంపిక
డీఎస్సీలో మెరిట్ అభ్యర్థులకు 1:3 రేషియాలో వచ్చే నెల రెండోవారంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, పండిట్, పీఈటీ కేటగిరీలో ఒక్కో పోస్టుకు ముగ్గురుచొప్పున సర్టిఫికేట్ల వెరిఫికేషన్‌కు పిలుస్తారు.



## తెరపైకి యువరాజ్ సింగ్ బయోపిక్

భారత స్టార్ క్రికెటర్ యువరాజ్ సింగ్ బయోపిక్ తెరకెక్కనుంది. ఆయన క్రీడా ప్రయాణాన్ని మూవీగా తీసుకురానున్నట్లు టీసిరీస్ అధికార ప్రకటన వెల్లడించింది. ఈ సినిమాలో యువరాజ్ సింగ్ అద్వితీయ క్రికెట్ ప్రయాణం, ఆయన పాత్ర వంటి అంశాల నేపథ్యంలోనే సినిమా తెరకెక్కనున్నట్లు తెలుస్తోంది. 2007 టీ20వరల్డ్ కప్, 2011 వరల్డ్ కప్ గెలవడంలో యువీ కీలక పాత్ర పోషించారు. క్యాన్సర్‌తో పోరాడి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు.

## వరదలతో పాకిస్తాన్ అతలాకుతలం.. 209కి చేరిన మృతుల సంఖ్య..

దాయాది దేశం పాకిస్తాన్‌ని భారీ వర్షాలు, మెరుపు వరదలు కలవరపెడుతున్నాయి. రుతుపవన వర్షాల కారణంగా సంభవిస్తున్న వరదలు దక్షిణ పాకిస్తాన్‌ని ముంచెత్తుతున్నాయి. జూలై 1 నుంచి వర్షాలు, వరదల కారణంగా మరణించిన వారి సంఖ్య 209కి పెరిగింది. పంజాబ్ ప్రావిన్స్‌లో గడిచిన 24 గంటల్లో 14 మంది మరణించారని ప్రావిన్షియల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ అధికారి ఇర్ఫాన్ అలీ తెలిపారు. ఇతర మరణాలు చాలా వరకు ఖైబర్ పఖ్తుంఖ్వా మరియు సింధ్ ప్రావిన్సులలో సంభవించాయి. దేశంలోని పలు ప్రాంతాల్లో ఈ వారం భారీ వర్షాలు కురుస్తాయని పాక్ వాతావరణ శాఖ తెలిపింది. పాక్‌లో వర్షాకాలం జూలై నుంచి సెప్టెంబర్ వరకు ఉంటుంది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు వాతావరణ మార్పులే కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 2022లో సంభవించిన భారీ వర్షాలు, వరదలు ఆ దేశంలోని మూడో వంతు భాగాన్ని ప్రభావితం చేశాయి. ఇప్పటికీ చాలా వరకు వ్యవసాయ భూముల్లో నీరు నిలిచే ఉంది. ఈ వర్షాల కారణంగా 2022లో 1,739 మంది మరణించారు. 30 బిలియన్ డాలర్ల నష్టం ఏర్పడింది, ఫలితంగా పాకిస్తాన్ దారుణమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంది.



## కీర్తి సురేష్ రఘు తాత సినిమా..

# ఓటీటీలో డైరెక్ట్‌గా స్ట్రీమింగ్

### సెప్టెంబర్ 14న ఓటీటీలో తెలుగు వర్షన్ డైరెక్ట్‌గా విడుదల

మాలీవుడ్ నుంచి కోలీవుడ్‌కి ఆ తర్వాత టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి కథానాయకిగా దుమ్ము రేపుతున్న నటి కీర్తి సురేష్. రెగ్యులర్ కమర్షియల్ పాత్రలతో పాటు ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్‌లో పవర్‌ఫుల్ క్యారెక్టర్స్ కూడా ఆమె చేస్తుంటారు. ఆమె నటించిన కొత్త సినిమా రఘు తాత ఓటీటీలో డైరెక్ట్‌గా విడుదల కానుందన ప్రచారం జరుగుతుంది. కీర్తి సురేష్ లీడ్ రోల్‌లో నటించిన ఈ సినిమాకు సుమన్ కుమార్ దర్శకత్వం వహించారు. ఆగష్టు 15న తమిళ్ వర్షన్ విడుదల అయింది. హిందీ భాషకు వ్యతిరేకంగా తెరకెక్కిన ఈ చిత్రం కోలివుడ్ ప్రేక్షకులను మెప్పించింది. కాగా, రఘు తాత మూవీ ఓటీటీ హక్కులను జీ5 సంస్థ సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. తెలుగు, తమిళం,మలయాళం, కన్నడ స్ట్రీమింగ్ హక్కులను జీ5 మంచి ధరకు కొనుగోలు చేసినట్లు ఇండస్ట్రీ వర్గాలు తెలుపుతున్నాయి. సెప్టెంబర్ మొదటి వారం లేదా సెప్టెంబర్ 14న ఓటీటీలో తెలుగు వర్షన్ డైరెక్ట్‌గా విడుదల అవుతుందని సినీ వర్గాలు తెలుపుతున్నాయి. హిందీ భాషను నేర్చుకోవడం తప్పనిసరి అనే విధానాన్ని వ్యతిరేకించడంతోపాటు మహిళలపై జరుగుతున్న పలు సంఘటనలను ఖండిస్తూ సాగే ఫ్యామిలీ ఎంటర్‌టైయినర్‌గా రఘుతాత సినిమా ఉంది.

